సాక్షి తిరుపతి

గురువారం । 19 । జూన్ । 2025



ముందే మామిడి కోతకు వెళ్లవద్దు

మామిడి రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హామీ ఇచ్చారు. - 10లో



యోగాడే విజయవంతం చేద్దాం

ఈ నెల 21 తిరుపతిలో చేపట్టే యోగా డేను అధికారులు విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. - 10లో



విద్యార్థుల భద్రతే ముఖ్యం

జిలాలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల భద్రతే తమకు ముఖ్యమని జిల్లా రవాణా అధికారి తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

అప్రెంటిషిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ రవాణా శాఖలో ఏడాది పాటు అప్రెంటిషిప్ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్/కన్వీనర్ పి.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అప్రెంటీస్‌కు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో మెకానిక్ మోటార్ వెహికల్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్లలో పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పది, ఐటీఐ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, మొబైల్ నంబరు, మెయిల్ ఐడీ, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈ నెల 30వ తేదీలోపు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని అప్రెంటీస్‌షిప్ అడ్వైజర్ సి.గంగాధరానికి దరఖాస్తులను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 94416 47174, 95507 22922 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి వరకు 84,681 మంది స్వామివారిని దర్శించుకోగా 35,261 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.43 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సివిల్ సప్లయ్ డీఎంగా బాలకృష్ణ



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం బాలకృష్ణ

తిరుపతి అర్బన్: సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్‌గా బి.బాలకృష్ణ కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ఓ పుష్పగుచ్ఛాన్ని అందించారు. చిత్తూరు నుంచి బి.బాలకృష్ణ తిరుపతి జిల్లాకు విచ్చేశారు. అలాగే తిరుపతి జిల్లా డీఎంగా పని చేస్తున్న వై.సుమతి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు.

పెండింగ్ కేసులను త్వరగా ఛేదించండి



పోలీసు స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

చంద్రగిరి: పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన ప్రణాళికబద్ధంగా ఛేదించాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక చంద్రగిరి పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పోలీస్ సిబ్బంది బయట డ్యూటీకి వెళ్లినప్పుడు సిబ్బందికి పాస్‌పోర్ట్ ఇస్తున్నారా ? లేదా అని ఆరా తీశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నైట్ బీట్ వెళ్లే సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, ఎస్బి సీఐ సాధిక్ అలీ, ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.



బెంగళూరు విమానాశ్రయంలో చెవిరెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న సిట్ అధికారులు

వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే నేతలను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసింది. ప్రతిపక్ష పార్టీని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో కుట్రలకు తెరతీసింది. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కీలక నాయకులపై కక్షగట్టింది. వైఎస్ జగన్ వెంట నడిచేవారిని వేధించేందుకు పన్నాగాలు పన్నుతోంది. వెంటాడి మరీ అరెస్ట్‌లు చేయించి పైశాచికానందం పొందుతోంది. అందులో భాగంగానే లిక్కర్ స్కామ్ అంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సర్కారు మంగళవారం అర్ధరాత్రి అరెస్టు చేయించింది. అన్యాయంగా అపనిందలు మోపి అప్రతిష్టపాలు చేసేందుకు.. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రజాదరణను అణచి వేసేందుకు యత్నిస్తోంది.



తిరుపతి ఎస్వీయూనివర్సిటీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కక్షగట్టి కేసులు

వైఎస్సార్‌సీపీ కీలక నేతలను వేధిస్తున్న ప్రభుత్వం

- లిక్కర్ స్కామ్ అంటూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టు
- అపనిందలతో అప్రతిష్టపాలు చేసేందుకు యత్నం
- గతంలో ఆయన వద్ద పనిచేసిన వారికీ తప్పని వేధింపులు
- ఎట్టకేలకు అరెస్ట్ చేయించి కూటమి నేతల పైశాచిక ఆనందం
- సాయం చేయడానికి వెళ్లినా.. కార్యకర్తల పరామర్శకు వెళ్లినా కేసులే..!

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం కుట్రలు పరాకాష్టకు చేరాయి. మాజీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలోని కొందరు పెద్దల డైరెక్షన్‌లో అధికారులు పని చేస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. ఇప్పుడు తప్పులు కేసులు పెడుతున్న అధికారులు.. రేపనేది ఒకటి ఉంటుందని.. ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏంటనేది ఆలోచన లేకుండా ప్రవర్తిస్తున్నారు. తాజాగా జిల్లాలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి చెవిరెడ్డి కుటుంబంపై కక్ష సాధించేందుకు కూటమి ప్రభుత్వంలోని కొందరు కుట్రలు పన్నుతూ వచ్చారు. అయితే నిత్యం ప్రజల మధ్య ఉండే చెవిరెడ్డి ఎటువంటి తప్పులు చేయరని అందరికీ తెలుసు. అయితే ఇటీవల ఎర్రావారిపాళెం మండలంలో ఓ బాలికపై అఘాయిత్యం జరిగిందని ఆమె తండ్రి చెవిరెడ్డికి ఫోన్ చేసి సాయం చేయమని అడిగితే.. ఆయన అక్కడకు వెళ్లి ఆడబిడ్డకు సాయం చేసినందుకు పోక్సో కేసు పెట్టారు.. ఆ కేసులో అరెస్టు చేయాలని చూసినా ఆ బిడ్డ తల్లిదండ్రులే మీడియా ముందుకు వచ్చి చెవిరెడ్డిపై తాము ఫిర్యాదు చేయలేదని చెప్పడంతో పోలీసులు వెనకడుగు వేశారు.

లిక్కర్ కేసులో ఎలా ఇరికించారంటే..!

ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో రూ.8 కోట్లు పోలీసులకు పట్టుబడితే దానిని ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఆ నగదుకు సంబంధించిన వారు వ్యాపార నిమిత్తం తరలిస్తుండగా పట్టుబడినట్లు చెబుతూ అందుకు తగిన ఆధారాలను కోర్టుకు, విజయవాడ పోలీసు కమిషనర్‌కు, ఎన్నికల అధికారులకు కూడా అందించారు. దానిపై కోర్టులో కేసు నడుస్తుండగానే చెవిరెడ్డి దగ్గర గతంలో పనిచేసిన గన్‌మెన్ గిరిని సిట్ అధికారులు తీసుకువెళ్లి బెదిరించి ఎన్నికల్లో పట్టుబడిన డబ్బుతో పాటు రూ.200 నుంచి రూ.250కోట్లు చెవిరెడ్డి తరలించినట్లుగా తప్పుడు స్టేట్‌మెంట్ తీసుకున్నారని అరెస్టుకు ముందు చెవిరెడ్డి మీడియాకు వివరించారు. గన్‌మెన్ గిరి ఇచ్చిన వివరాల మేరకు మరో గన్‌మెన్ మదన్‌రెడ్డి, గతంలో చెవిరెడ్డి దగ్గర వ్యక్తిగత సహాయకులుగా పనిచేసిన బాలాజీ, నవీన్ పేర్లను కూడా ఆ కేసులో ఇరికించారని, వారందరినీ భయపెట్టి చెవిరెడ్డి తీసుకురమ్మంటేనే ఆ డబ్బులు తరలించినట్లుగా స్టేట్‌మెంట్లు రికార్డు చేశారని మీడియా ముందు చెవిరెడ్డి స్వయంగా వెల్లడించారు. ఇంతమందిని వేధించి, నరకం చూపించడం కన్నా తనను నేరుగా అరెస్టు చేసుకోవచ్చని కూడా చెప్పారు. అయితే సిట్ అధికారులు మాత్రం చెవిరెడ్డికి బెయిల్ లభించకుండా చేయడానికి అన్ని విధాలుగా స్టేట్‌మెంట్లు తయారు చేసుకున్న తరువాతే ఆ పనిచేశారు. మదన్‌రెడ్డి డీజీపీకి రాసిన లేఖతో ఖంగుతిన్న సిట్ అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా చెవిరెడ్డి అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. ఆ సమయంలో ఆయన విజయవాడలోనే ఉన్నట్టు తెలిసినా సిట్ అధికారులు ఎందుకు అరెస్టు చేయలేదనేది ప్రశ్నార్థకం.

నేరుగా అరెస్టు చేసుకోండని సవాల్ చేసినా..

ఏ తప్పు జరగని లిక్కర్ స్కాం కేసులో చెవిరెడ్డిని అక్రమంగా ఇరికించారు. అంతేకాదు.. అరెస్టు చేసిన తరువాత బెయిల్ రాకుండా చేయడానికి ఆయన దగ్గర గతంలో పనిచేసిన వారందరినీ వేధించి మరీ స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు స్వయంగా చెవిరెడ్డి మీడియాకు తెలిపారు. చెవిరెడ్డి దగ్గర పనిచేసిన వారందరికీ సిట్ అధికారుల వేధింపులు మాత్రం తప్పలేదు. ఇంతమందిని వేధించడం వెనుక తప్పుడు కేసుల్లో చెవిరెడ్డిని ఇరికించడానికి చేసిన ప్రయత్నమే అనేది ఆయన దగ్గర గన్‌మెన్‌గా పని చేసిన మదన్‌రెడ్డి ఇటీవల డీజీపీకి రాసిన లేఖతో తేటతెల్లమైంది. ఆ లేఖతో అప్పటి వరకు సిట్ అధికారులు చేసిన టార్చర్‌ను సోషల్ మీడియా వేదికగా చెవిరెడ్డి స్వయంగా బయటకు తేవడంతో మీడియాలో వరుస కథనాలు ప్రసారమయ్యాయి. సిట్ అధికారులు తప్పుడు సాక్ష్యాలు సృష్టించడానికి సామాన్యులను నరకం చూపుతున్నారనే విషయం బహిర్గతం కావడంతో చేసిన తప్పు కప్పి పుచ్చుకునేందుకు, ఆ విషయాన్ని దారి మళ్లించేందుకు చెవిరెడ్డిని అరెస్టు చేయడం ఒక్కటే మార్గమని సిట్ అధికారులు భావించారు. అందుకే ఎలాంటి ఎఫ్ఐఆర్ కాపీని చెవిరెడ్డికి ఇవ్వకుండా, కేసు పెట్టినట్టు చెప్పకుండా విజయవాడలోనే తిరుగుతున్న చెవిరెడ్డిని పట్టుకోకుండా.. లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు వెళ్తుంటే బెంగళూరు విమానాశ్రయంలో పట్టుకున్నట్టు సిట్ అధికారులు కలరింగ్ ఇచ్చారనే విమర్శలు వైఎస్సార్‌సీపీ నేతల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఎల్లో నేతల పైశాచిక ఆనందం

ఏపీ లిక్కర్ స్కాం కింద సిట్ అధికారులు చెవిరెడ్డిని అరెస్టు చేయడంతో కూటమి ప్రభుత్వంలోని పెద్దలు పైసాచిక ఆనందం పొందుతున్నారని చెవిరెడ్డి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆరోపిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా సాయం చేయడంతో పాటు ఎవరినీ ఇబ్బంది పెట్టని చెవిరెడ్డికి ఇన్ని కష్టాలు రావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెవిరెడ్డికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని, ఆ కుటుంబానికి అండగా నిలబడతామని గ్రామస్తులు, బంధువులు స్పష్టం చేస్తున్నారు. చెవిరెడ్డి అరెస్టుపై కూటమి ప్రభుత్వం కక్షకట్టిందని ఈ రాష్ట్ర ప్రజలకు సుస్పష్టమైంది.



అండగా ఉంటామని చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మికి ధైర్యం చెబుతున్న పార్టీ నేతలు

ఉద్యమాల నుంచి పుట్టిందే వైఎస్సార్‌సీపీ

- చెవిరెడ్డి అక్రమ అరెస్టుపై నిరసనల హోరు
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

తిరుపతి రూరల్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాల నుంచి పుట్టిందని, ఆ పార్టీలో ఉన్న వారంతా ఉద్యమ స్ఫూర్తితో పోరాడే వారు తప్ప పిరికివారు ఎవ్వరు లేరని పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ అరెస్టుతో చంద్రగిరి, తిరుపతి పరిసరాల్లో నిరసనలు హోరెత్తాయి. చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు బుధవారం పెద్ద ఎత్తున శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్దకు చేరకుని అక్కడి అంబేడ్కర్ విగ్రహం ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దామినేటి కేశవులు మాట్లాడుతూ.. ''మీరు అరెస్టు చేయాలంటే నేను సిద్ధంగా వున్నా.. మీరు తిరుపతికి రావడం కష్టమైతే నాకు ఫోన్ చేస్తే నేనే సిట్ కార్యాలయానికి వస్తాను..'' అని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చెప్పారనీ, అయినా సిట్ అధికారుల్లో ఏ ఒక్కరు చెవిరెడ్డికి ఫోన్ చేయలేదన్నారు. ఆయన ఇంటి దగ్గర ఉన్నప్పుడు వదిలేసి వ్యాపార నిమిత్తం విదేశాలకు వెళుతున్నప్పుడు అరెస్టుచేసి, విమానాశ్రయంలో పట్టుకున్నామని చెప్పకోవడంపై దామినేటి కేశవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మునీశ్వరరెడ్డి, కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, సింహాల మోహన్, హేమేంద్రరెడ్డి, విడుదల మాధవరెడ్డి, ఓబుల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బుజ్జి, సిద్ధారెడ్డి, హరిక్రిష్ణరెడ్డి, రాజేష్, రవి రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగార్జున్ రెడ్డి, భాస్కరరెడ్డి, లక్ష్మీ నారాయణ, శివశంకర్ రాజు, వైస్ ఎంపీపీ యశోదమ్మ, మొక్కల భారతి, కళావతి, నాగ భూషణమ్మ, శివ శంకర్, లక్ష్మయ్య, యోగానందరెడ్డి, మస్తాన్, ఒంటి శివశంకర్ రెడ్డి, కోటేశ్వర రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెంగల్‌రెడ్డి, చెంచు మోహన్ యాదవ్, శెల్వం, వాసు, మన్నూరు శివ, దయానంద్, శెంథిల్, బడి వెంకటేష్, దొరబాబు, షాహిద్‌లతో పాటు అన్ని మండలాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏడాదిగా ఏపీలో అరాచక పాలన



జరగని స్కాంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చేర్చి అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణం. ఏడాది నుంచి రాష్ట్రంలో కూటమి అరాచక పాలనకు అంతులేకుండా పోతోంది. ప్రజాప్రతినిధుల వద్ద గన్‌మెన్‌లుగా పనిచేసిన పోలీసులను సైతం లాక్కెళ్లి అబద్ధపు వాంగ్మూలం ఇవ్వమని చిత్రహింసలకు గురిచేయడం ఏపీలోని కూటమి పాలనకే చెల్లింది. మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటన కార్యక్రమం నుంచి జనం దృష్టి మరల్చడానికే చెవిరెడ్డిని రాత్రికి రాత్రే అరెస్టు చేశారు. అక్రమ కేసులు, అరెస్ట్‌లతో భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం వారి అవివేకానికి నిదర్శనం. ప్రజల నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి భయపడి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు.

– భూమన కరుణాకర రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు

చెవిరెడ్డి అరెస్ట్ అక్రమం



చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్టు అక్రమం. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవస్థలను అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తోంది. ఆ కుట్రలో భాగంగానే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టిగా ఎదుర్కొంటాం.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి పార్లమెంటు సభ్యుడు

అప్రజాస్వామికం



రాజకీయ కక్షతో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికం. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా చెవిరెడ్డిని రాజకీయంగా అణగదొక్కేందుకే సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేష్ చేస్తున్న కుట్ర. ఏ తప్పూ చేయని ఆయనను మద్యం కేసులో ఉద్దేశపూర్వకంగా ఇరికించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కీలక నాయకులను అరెస్టు చేస్తూ కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోంది.

– నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త

జగనన్న సునామీని అడ్డుకోలేరు

- మృతుల కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లడం తప్పా?
- మాజీ మంత్రి ఆర్కేరోజా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి రోజా

నగరి: జగనన్న అభిమాన సునామీని ఎవరూ అడ్డుకోలేరని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం మృతి చెందిన పార్టీ నేత కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పోలీసులు ఆంక్షలు విధించడం, పర్యటనను భగ్నం చేసేందుకు ప్రయత్నించడంపై ఆమె బుధవారం స్పందించారు. నగరిలోని తన నివాస కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఆంక్షలు, షరతులు, బెదింపులు, నోటీసులు, బారికేడ్లు జగనన్న అభిమాన సునామీని ఆపలేక పోయాయన్నారు. 'రోడ్లు మూసేస్తే మాకేంటీ.. పోలీసులను అడ్డుపెడితే మాకేంటీ.. జగనన్న కోసం అడ్డంకులు ఎదుర్కొని వస్తాం, మా నరాల్లో ప్రవహించే రక్తం జన నేతను చూడాలని పరితపిస్తోంది' అంటూ పొలాల గట్లపై జన ప్రవాహం బైకుల్లో తరలివచ్చిందన్నారు. ముళ్ల దారులు వారికి జాతీయ రహదారులుగా కనిపించాయన్నారు. తగ్గేదేలే అంటూ.. జగనన్నను చూడడానికి జనం తరలివచ్చారన్నారు. ప్రభుత్వ వేధింపులు భరించలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే, ఆయన కుటుంబాన్ని జగనన్న పరామర్శించడానికి వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు. ఆ పార్టీ కార్యకర్తలు చనిపోయినప్పుడు చంద్రబాబు వెళ్లి ఆ కుటుంబాలను పరామర్శించలేదా? అని రోజా ప్రశ్నించారు. ఆంక్షలు పెట్టి ప్రజాదరణ కలిగిన నాయకుడిని అడ్డుకోవాలని చూడడం ఏ మాత్రం సబబుకాదన్నారు.

కూటమి పాలనలో మహిళలకు భద్రత కరువు



బొర్రా మాధవిరెడ్డి

కేవీబీపురం: కూటమి పాలనలో మహిళలకు భద్రత లేదు అనేందుకు సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో శిరీషా అనే మహిళపై టీడీపీ కార్యకర్త కుటుంబం దాడికి పాల్పడడమే సాక్ష్యమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవి రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళా హోం మంత్రి ఉన్నప్పటికీ మహిళలపై ఇలాంటి దారుణ ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై అఘాయిత్యాలు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. అయితే మహిళలకు అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానని ప్రగల్భాలు పలికిన పవన్‌కల్యాణ్ ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కూటమి కుట్రకు కౌన్సిల్ ఎదురుదెబ్బ



కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: రూ.కోట్ల విలువ చేసే తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తిని కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా విక్రయించాలన్న ప్రతిపాదనకు ఎదురుదెబ్బ తగిలింది. బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే శ్రీనివాసులు హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశంలో 84 అంశాలతో అజెండాలు, రెండు టేబుల్ అజెండాలను ప్రతిపాదించారు. ఇందులో రెండు అంశాలను కౌన్సిల్ సభ్యులు వ్యతిరేకించారు. ప్రధానంగా సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం బస్టాండ్ సమీపంలోని కార్పొరేషన్‌కు చెందిన 77 సెంట్లు విలువైన స్థలాన్ని విక్రయించాలన్న కుట్రకు బ్రేక్‌పడింది. ఈ స్థలాన్ని కారుచౌకగా కొట్టేసేందుకు ఓ మంత్రి వేసిన ఎత్తును కౌన్సిల్ అడ్డుకుంది. మొత్తం 47 మంది ఓటింగ్‌లో పాల్గొనగా స్థల విక్రయ ప్రతిపాదనను 35 మంది సభ్యులు వ్యతిరేకిస్తూ ఓటు వేశారు. రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని తక్కువ ధరకే కాజేయాలని పన్నాగం వేసిన ఓ మంత్రితో పాటు కూటమి నేతలకు అందుకు వత్తాసు పలికిన అధికారులకు.. కౌన్సిల్ తీర్మానం చెంపపెట్టుగా మిగిలింది.

అక్షరాభ్యాసం



శ్రీకాళహస్తీశ్వరాయలయంలో అక్షరభ్యాన మహోత్సవం బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని దక్షిణామూర్తి వద్ద వేదపండితులు ముందుగా కలశప్రతిష్ట చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమపిల్లలను తీసుకుని పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. వారికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి పలకలు, బలపాలు అందజేశారు. చిన్నారుల చేత అక్షరాలు దిద్దించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుదక్షిణామూర్తి సన్నిధిలో చిన్నారుల చేత అక్షరాలు దిద్దించడం పూర్వజన్మ సుకృతమన్నారు. ప్రతి చిన్నారి బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి

70 మందికి ఉద్యోగాలు

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న అటానమస్ హోదా పొందిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపస్ డ్రైవ్‌లో 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా పేరొందిన ఎంఎన్‌సీ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి 70 మంది విద్యార్థులను పలు ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జగతి నెట్‌వర్క్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఎండీ వాసు దేవనాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భరత్, హెచ్ఆర్ టీం సభ్యులు లీలాసింగ్, వాసు, ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ మల్లికార్జున, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మార్కొండేయ, రత్నారావు, కిషన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.1,02,380

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.9,257

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,12,700

రిటైల్ వెండి గ్రాము రూ.115.70

క్లుప్తంగా

ఆటోలో ప్రయాణిస్తుండగా..



ఘటనాస్థలిలో మృతి చెందిన చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పాకాల మండలం శంఖంపల్లికి చెందిన ఆటో డ్రైవరు కిషోర్ బుధవారం తెల్లవారుజామున నేండ్రగుంట నుంచి న్యూస్‌పేపర్లను వేసుకుని తిరుపతికి పయనమయ్యాడు. పాకాల మండలం గాలివారిపల్లికి చెందిన ధనశేఖర్ రెడ్డి(36), రేణిగుంటకు చెందిన రాజశేఖర్, ప్రతాప్‌లను ఆటోలో ఎక్కించుకున్నాడు. అయితే మామండూరు వద్ద ఆగి ఉన్న వాహనాన్ని కిషోర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ రెడ్డి ఆటో డ్రైవరు పక్కన కూర్చుని ఉండడంతో అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాడేని విజయవంతం చేద్దాం

తిరుపతి అర్బన్: ఈనెల 21న యోగాదినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యాక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తోపాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు పలు విభాగాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21న తిరుపతిలోని తారకరామ స్టేడియంలో 10వేల మందితో పెద్దఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ వారు శానిటేషన్, తాగునీరు ఏర్పాటు, వైద్య ఆరోగ్య శాఖవారు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, జిల్లా పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రించడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ఆదేశించారు. పలు యూనివర్సిటీల నుంచి విద్యార్థులు, సిబ్బంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని వీసీలను ఆదేశించారు. 21న శనివారం ఉదయం 6 గంటలకే అందరూ హాజరయ్యేలా చూడాలని తెలిపారు. తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, యూనివర్సిటీల వీసీలు, జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, సాంఘిక సంక్షేమ అధికారి విక్రం కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



తవణంపల్లె: ఎఫ్-3 ఫ్యాక్టరీ వద్ద మామిడి కాయలు అన్‌లోడ్డు చేయడానికి క్యూ కట్టిన ట్రాక్టర్లు

మామిడి విలవిల

మామిడి రైతు దిగుబడులను విక్రయించేందుకు అగచాట్లు పడుతున్నారు. పండ్లు పక్వానికి వచ్చినా కోయలేక అన్నదాత విలవిలలాడుతున్నారు. ఫ్యాక్టరీలు, ర్యాంపులు కాయలు కొనడానికి ముఖం చాటేయడంతో ఆవేదన చెందుతున్నారు. అధికారుల చెప్పిన రేటు ఎక్కడా అమలు కావడంలేదని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కాయలు తీసుకొనేందుకు జులై వరకు టోకెన్లు ఇవ్వడంపై అన్నదాతలు మండి పడుతున్నారు. తోటల్లో కాయ పక్వానికి వచ్చి రాలిపోతుంటే...గడువు మరో 15 రోజుల వరకు ఇవ్వడం ఏంటని నష్ట పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పంటను అమ్ముకోవడానికి ఫలరాజు పాట్లు
- అన్నదాతలకు కోతల కన్నీళ్లు
- ముఖం చాటేస్తున్న ఫ్యాక్టరీలు.. చివరికి ర్యాంపులూ
- రాలిపోతున్న కాయలు.. నష్ట పరిహారం ప్రకటించాలి



చిత్తూరు మార్కెట్‌కు వచ్చిన మామిడి కాయలు

కాణిపాకం : జిల్లాలో మామిడి విపత్తు ఎదురవుతోంది. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. పంట పక్వానికి వచ్చినా కోతలు కోయలేక కన్నీళ్లు పెడుతున్నారు. ఫ్యాక్టరీలు ముఖం చాటేస్తున్నాయి. ర్యాంపులు ఇదే దారిలో పయనిస్తూ... కాయలను కొనలేమని చేతులెత్తేస్తున్నాయి. టోకెన్లు గడువు ఉన్నంత వరకు కాయలకు గడువులేదని... ప్రభుత్వం ప్రోత్సాహక నిధి ప్రకటించి రైతుల గోసను గాలికొదిలేసిందని రైతులు ఆక్రోశానికి గురవుతున్నారు.

టోకెన్ ఉన్న రైతుల పరిస్థితి ఇదీ..

మామిడి రైతులు పండించిన పంట విక్రయానికి జిల్లాలోని ఫ్యాక్టరీల వద్దకు పోటెత్తుతున్నారు. వేల మంది రైతులు ఒక్కసారిగా ఫ్యాక్టరీలను ముట్టడిస్తున్నారు. ఈపోరు పడలేక ఫ్యాక్టరీలు, అధికారులు కలిసి వచ్చిన వారి అందరికీ టోకెన్లు పంచిపెట్టేస్తున్నారు. ఈ టోకెన్ల జారీ జూన్ నెల దాటింది. పలు ఫ్యాక్టరీలు జులై నెల ఆఖరు వరకు కొనుగోలు చేస్తామని టోకెన్లు ఇచ్చేసింది. మరో వారం, పది రోజుల్లో మామిడి పంట పూర్తిగా నేలమట్టమయ్యే అవకాశం ఉందని రైతులు కంట తడి పెడుతున్నారు. ఈ తరుణంలో జులై నెల ఆఖరు వరకు పంట ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయ పండై..పురుగు పట్టి రాలిపోవడం ఖాయమని కన్నీళ్లు కారుస్తున్నారు. ఇప్పటి వరకు 30 శాతం వరకు మాత్రమే పంట అమ్ముడుబోయినట్లు రైతులు చెబుతున్నారు.

నష్టపరిహారం ఇవ్వాల్సిందే...

మామిడి పంటను కోసి అమ్ముకునే పరిస్థితి లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. ఫ్యాక్టరీలు జిల్లా మామిడిని తోసి పుచ్చుతున్నాయంటూ గోల చేస్తున్నారు. సిఫార్సులకు పెద్దపీట వేస్తూ....సామాన్య రైతు కష్టాన్ని పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

ఒక్క టోకెన్ స్వామీ...!

జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. ఫలంపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తోటలోని కాయలు మట్టిపాలవుతున్నాయి. రైతులు ఫలం పరిస్థితి చూసి కన్నీళ్లు కారుస్తున్నారు. చాలా మంది కాయలను అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారి అనుమతి కోసం బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు, పూతలపట్టు, తవణంపల్లి, జీడీ నెల్లూరు తదితర ప్రాంతాలకు తిరిగేస్తున్నారు. తెలిసిన వ్యక్తులు, పలుకుబడి ఉన్న వ్యక్తులు, కూటమి నేతలు, పలుశాఖ అధికారుల ద్వారా టోకెన్ల కోసం బతిమిలాడుకుంటున్నారు. ఒక్క టోకెన్ అయినా తీసి ఇవ్వు స్వామీ అంటూ రైతులు వారిని ప్రాధేయపడుతున్నారు.

ప్రస్తుతం ఫ్యాక్టరీల వద్ద ఇబ్బంది పడుతోంది... సామాన్య రైతులేనని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కొనాలంటే..మాకేమి లాభమని..ఫ్యాక్టరీలు పక్క రాష్ట్రాల కాయలపై మొగ్గు చూపుతున్నాయంటూ ఆగ్రహానికి గురవుతున్నారు. ఫ్యాక్టరీలు రూ.5, రూ.6ను కూడా తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

2018 నష్టాలు గుర్తుకొస్తున్నాయి..

ప్రస్తుతం మామిడి పరిస్థితి చూసి రైతులు 2018 మామిడి సంఘటనను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40 శాతం పంట మాత్రమే వస్తే ఫ్యాక్టరీలు పంటను కొనకపోతే కాయలను తీసుకొచ్చి కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై పోసి నిరసనకు దిగారు. చివరకు కేజీ తోతాపురి రూ.2 వరకు పలికింది. నాటి టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నిధి రూ.2.50 చొప్పున రూ.2.19 కోట్ల నిధుల చెల్లింపుల్లో జాప్యం చోటు చేసుకున్నాయి.

చేతులెత్తేసిన ర్యాంపులు

జిల్లాలో ఇప్పటి వరకు 23 ర్యాంపులు నడుస్తున్నాయి. ఈ ర్యాంపులకు రోజువారీగా ఒక్క లారీ నుంచి రెండు లారీలా వరకు ఫ్యాక్టరీలకు అమ్ముకోవడానికి అనుమతులున్నాయి. ఈ ర్యాంపును నిర్వర్తించే వ్యాపారులు సొంత కాయలు, బంధువులు, తెలిసినా వాళ్ల మామిడి కాయలు అమ్ముకోవడానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగిలిన రైతుల మామిడిని కొనలేమని, ఫ్యాక్టరీ వాళ్లు తీసుకోవడం లేదని తలుపులు వేసేస్తున్నారు. ర్యాంపులకు వెళ్లిన రైతులకు వారం తర్వాతే కాయలు కొంటామని చెప్పేస్తున్నారు. అధికారులు చెప్పిన రేటు (రూ.3.50) కుదరదని, రూ.3 నని, మరో వారం తర్వాత ఆ రేటు చెప్పలేమని రైతులకు సమాధానమిస్తున్నారు. దీంతో మామిడి రైతులు తల్లడిల్లిపోతున్నారు.

ముందే మామిడి కోతకు వెళ్లవద్దు

- మామిడి రైతులకు అధికారుల సూచన
- వర్షాలు వస్తే మా పరిస్థితి ఏంటి అంటున్న రైతులు
- ఆలస్యం చేస్తే చెట్టులోనే పండుతాయి
- పంట నేల రాలితే వచ్చే నష్టం ఎవరు భరిస్తారు ?
- మామిడి రైతుల ఆవేదన



కలెక్టరేట్ నుంచి మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి అర్బన్: మామిడి రైతులు కంగారుపడి ముందే మామిడిపంట కోతకు వెళ్తున్నారని, అలా వెళ్లవద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మామిడికోతలు, వాటి కొనుగోలుపై సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడారని తెలియజేశారు. కలెక్టరేట్ నుంచి ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఉద్యానశాఖ అధికారులు హజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడి పంట సేకరణకు సంబంధించి సమాచారాన్ని రైతులకు అందిస్తామని వెల్లడించారు. జిల్లాలో 20,500 మంది మామిడి రైతులు ఈక్రాప్ చేశారని వారికి న్యాయం చేస్తామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1,45,00 మెట్రిక్ టన్నులు మామిడి ఉత్పత్తి రానుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 8 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి 2,176 మంది రైతుల నుంచి 15 వేల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వివరించారు. 8 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రోజు వారి సామర్థ్యం 2,200 మెట్రిక్ టన్నులు మాత్రమేనని వెల్లడించారు. ఆ మేరకు మాత్రమే వారు సేకరిస్తున్నారని రైతులకు కంగారు లేకుండా కోత ఉంటే అందరికీ సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు.

రైతుల వాదన మరోలా..!

జిల్లావ్యాప్తంగా మామిడి రైతులపైనే చర్చ సాగుతోంది. అధికారులు తోతాపురి రకానికి కేజీ రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని, ప్రభుత్వం కేజీకి రూ.4 ఇస్తుందని చెబుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే కంగారు పడకండి అంటూ అధికారులు చెబుతున్నప్పటికీ రైతుల వాదన మరోలా ఉంది. ముందే వర్షాలు పదేపదే వస్తున్నాయి. ఈ కాలంలో వచ్చే అకాల వర్షాలకు టన్నుల కొద్దీ మామిడిపంట రాలిపోతుంది. ఆ పంట నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు ? మరోవైపు పంట కోతకు సిద్ధంగా ఉంది. సమయం పడుతుందంటే ఎలా ? చెట్టులోనే పంట పండిపోయే ప్రమాదం ఉంది ? అలా పండిన పంట తప్పకుండా రాలిపోతుంది.. దాన్ని ఏం చేయాలి ? అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడెక్కడ ఎంత టైం పడుతోందంటే..!

జిల్లాలోని 8 మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలకు సంబంధించి.. రైతుల నుంచి మామిడి కొనుగులు చేయడానికి వేచి ఉండాల్సిన సమయాన్ని కలెక్టరేట్ నుంచి అధికారులు బుధవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వాహనాలను తెలియజేశారు. అవి పూర్తి చేయడానికి పట్టే సమయాన్ని వెల్లడించారు. ఆ తర్వాత రైతుల నుంచి మామిడి సేకరించనున్నారు.

- నవ క్వాలిటీ ఫుడ్స్, ఎర్రావారిపాలెం దగ్గర అన్ని చాంబర్లు నిండుగా ఉన్నాయి. రైతులు వేచి ఉండాల్సిన సమయం 36 గంటల సమయం పడుతుంది.
- రాసా ఫుడ్స్, బీఎస్ కండ్రిగ దగ్గర ప్రస్తుతం రెండు వాహనాలు సరుకుతో ఉన్నాయి వేచి ఉండే సమయం మరో గంట సమయం.
- లియాన్ ఫుడ్స్, పుత్తూరు- 45 వాహనాలు ఉన్నాయి. అయితే వారు కొనుగోలు చేయడానికి 12 గంటల సమయం పడుతుంది.
- టాసా ఫుడ్స్, నారాయణవనం - 40 వాహనాలు ఉన్నాయి. 24 గంటల సమయం వేచి ఉండాల్సి ఉంది.
- శ్రీవర్ష ఫుడ్స్, రేణిగుంట - 20 వాహనాలు ఉన్నాయి. మరో 12 గంటల సమయం పడుతుంది.
- శ్రీదేవరాజు ఆగ్రో ఫుడ్స్, కేవీబీపురం -28 వాహనాలు ఉన్నాయి. మరో 12 గంటల సమయం పడుతుంది.
- క్యాప్రికాన్, సత్యవేడు-3 వాహనాలు ఉన్నాయి. మరో 5 గంటల సమయం పడుతుంది.
- సుప్రీం క్వాలిటీ ఫుడ్స్, పాకాల- 8 వాహనాలు ఉన్నాయి
- మరో 20 గంటల సమయం పడుతుంది

రైతులకు నష్టం రాకుండా చర్యలు

పాకాల : పక్వానికి వచ్చిన మామిడి కాయలను విడతల వారీగా కొయ్యాలని డీహెచ్ఓ దశరథరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన దామలచెరువులోని ర్యాంపులను పరిశీలించారు. ఒకటి రెండు ర్యాంపుల వద్ద మిగిలిపోయిన కాయలను ఇతర ర్యాంపుల వద్దకు తరలించి రైతులకు నష్టం రాకుండా చర్యలు చేపట్టారు. అలాగే మామిడి రైతులు ధైర్యంగా ఉండాలని, సప్లయర్స్ అన్ని కాయలను కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రైతులకు ధైర్యం చెప్పారు. ర్యాంపునలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ అధికారులు సూచనలు చేసిన విధంగా కాయలను కొయ్యాలన్నారు.

గోడ కూల్చితే ఆత్మహత్య చేసుకుంటాం



గోడను తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటామంటూ అధికారులను హెచ్చరిస్తున్న నిర్వాసితులు

పెళ్లకూరు : పట్టా భూమిలో దౌర్జన్యంగా రోడ్డు వేస్తే ఆత్మహత్యే శరణ్యం అని భూయజమానులు తేల్చి చెప్పడంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగిన ఘటన బుధవారం శిరసనంబేడు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని సర్వే నంబరు 149/3లో ఉన్న 1.95 ఎకరాల పట్టా భూమిలో గత కొన్ని రోజులుగా గ్రామానికి చెందిన అధికారపార్టీ నాయకుల మధ్య కార్చిచ్చు రగులుకుంది. గ్రామంలో ఉన్న ఓ స్టీల్ పరిశ్రమకు సంబంధించిన వాహనాల రాకపోకల కోసం అదే గ్రామానికి చెందిన కొందరి పట్టా భూముల్లో తాత్కాలికంగా గ్రావెల్‌రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇటీవల కంపెనీ యాజమాన్యం భూయజమానులకు తెలియకుండా గ్రావెల్‌రోడ్డును బీటీరోడ్డుగా మార్చుతూ చకచకా పనులు చేపట్టారు. దీంతో భూ యజమానులు తమ పట్టా భూముల్లో వేస్తున్న బీటీరోడ్డు పనులను అడ్డగించి భూములను కాపాడుకోవడం కోసం దారికి అడ్డంగా గోడ ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి పరిశ్రమ వాహనాలు గ్రామంలోని ప్రధాన వీధిలో రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే అదే గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు జిల్లా ఉన్నతాధికారులను కలిసి దారికి అడ్డంగా గోడ ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దారికి అడ్డంగా ఉన్న గోడను తొలగించడం కోసం గ్రామానికి చేరుకున్న రెవెన్యూ అధికారుల ఎదుట ఆత్మహత్యే శరణ్యం అంటూ నిర్వాసితులు తేల్చి చెప్పారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. దారి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీటీ యువరాజ్, వీఆర్వో మొబీనా, సర్వేయర్లు పూజిత, సూర్య, ఉన్నారు.

మనస్తాపంతో మహిళ మృతి



మృతి చెందిన నీలిమ

తిరుపతి క్రైమ్: నగరంలో నివాసం ఉంటున్న ఓ మహిళ మనస్తాపంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జీవకోన సత్యనారాయణపురంలో నివాసం ఉంటున్న బాబు రెడ్డి, మణి కుమార్తె నీలిమ(29)కు ఆరేళ్ల కిందట వివాహమైంది. ఆమెకు నాలుగేళ్ల పాప ఉంది. అయితే నీలిమకు భర్తతో విభేదాలు ఉండడంతో నాలుగేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై ఆమె తల్లి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

బాలిక కనిపించలేదని ఫిర్యాదు

వాకాడు:మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన తన కూతురు మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదంటూ మైనర్ బాలిక తల్లి బుధవారం వాకాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వాకాడు మండలం చినతోట గ్రామానికి చెందిన ఓ యువకుడు మైనర్ బాలికను రాత్రి సమయంలో కారులో ఎత్తుకెళ్లినట్లు బాలిక ఫిర్యాదులో వివరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యోగాభ్యాసం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం శ్రీకాళహస్తిలోని రాజగోపురం వద్ద నిర్వహించిన అంతర్జాతీయ యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరుడి చెంత యోగా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, పర్యాటక రీజనల్ అధికారి రమణప్రసాద్, ఆలయ ఈఓ బాపిరెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు, యోగ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు. - శ్రీకాళహస్తి

ట్రాక్టర్‌లో వెళ్తుండగా కింద పడి..

సూళ్లూరుపేట రూరల్ : ట్రాక్టర్‌లో నుంచి అదుపు తప్పి కిందపడి గిరిజన యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. స్థానికుల సమాచారం మేరకు దొరవారిసత్రం మండలం ఉచ్చూరు ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌లో సూళ్లూరుపేట నుంచి గ్రామానికి వెళ్తుండగా మన్నారుపోలూరు వద్ద కోట్లపాటి మునిశేఖర్(22) ట్రాక్టర్‌లో నుంచి అదుపుతప్పి కింద పడ్డాడు. తల పగలడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమచారం అందించారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కొరడా

- ఆర్కే గార్డెన్స్‌కు జరిమానా విధింపు
- జిల్లా రిజిస్ట్రార్ విచారణలో అక్రమాలు బహిర్గతం
- రూ.10.80 లక్షల స్టాంపు డ్యూటీ చెల్లించాలంటూ ఆదేశం
- ఫలించిన సమాచార హక్కుల వేదిక పోరాటం



ఆర్.కె.గార్డెన్ ఫంక్షన్ హాల్

పుత్తూరు : మండల పరిధిలోని ఆర్కే గార్డెన్స్ ఫంక్షన్ హాల్ యజమాని రవీంద్రన్‌కు రూ.10.80 లక్షల స్టాంప్ డ్యూటీతో పాటు అపరాధ రుసుం చెల్లించాలంటూ తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆర్డర్ కాపీని గత మే నెల 29వ తేదీన జారీ చేశారు. ఆర్డర్ కాపీ అందుకున్న 15 రోజుల్లోపు స్టాంప్ డ్యూటీ మొత్తాన్ని చెల్లించాలని లేని పక్షంలో ఇండియన్ స్టాంప్స్ సెక్షన్ 1899 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నివాస ఖాళీ స్థలంగా చూపడంతో..

స్థానిక ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న ఎం.రవీంద్రన్ పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రిగ పంచాయతీ చిన్నబ్బనాయుడు కండ్రిగ వద్ద ఆర్కే గార్డెన్ ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఆయన 2023 డిసెంబర్ 13, 14 తేదీల్లో పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కుమార్తె ప్రత్యూష పేరిట సదరు ఆస్తిని రిజిస్టర్ చేయించారు. సదరు ఆస్తిని ఖాళీ స్థలంగా చూపు తూ డిక్లరేషన్ ఇచ్చారు. ఆస్తి విలువ రూ.1,08,96,604గా పేర్కొన్నారు.

సమాచార హక్కుల వేదిక ఫిర్యాదు

పుత్తూరు మండలం ఆర్కే గార్డెన్స్ నిర్మాణానికి పంచాయతీ నుంచి, తుడా కార్యాలయం నుంచి పొందిన అనుమతులను కోరుతూ స్థానిక సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి ఆర్టీఐ ద్వారా సమాచారాన్ని కోరడంతో అసలు విషయం బయట పడింది.

కేవలం రూ.2.18 లక్షలు చెల్లించి..

స్టాంప్ డ్యూటీ రూ.12.94 లక్షలు కాగా, రవీంద్రన్ ఇచ్చిన తప్పుడు డిక్లరేషన్ ద్వారా కేవలం రూ.2.18 లక్షలు మాత్రం చెల్లించినట్లు విచారణలో తేటతెల్లం అయింది. దీంతో డెఫిసిట్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.4,720తో కలిపి మొత్తం రూ.10,80,520 చెల్లించాలంటూ రవీంద్రన్‌ను ఆదేశించారు.

జిల్లా రిజిస్ట్రార్ విచారణ ఇలా..

- సమాచార హక్కుల వేదిక వారు ఆర్టీఐ ద్వారా అడిగిన వివరాల మేరకు తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ చేపట్టిన విచారణలో వాస్తవాలు వెలుగు చూశాయి.
- జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పుత్తూరు ఎంపీడీఓ స్థల పరిశీలన చేసి ఇచ్చిన నివేదికలో సర్వే నంబర్ 145-1ఏ2, 145-2బి2లో 2023 డిసెంబర్ నాటికే ఆర్కే గార్డెన్ ఫంక్షన్ హాలు నిర్మాణం పూర్తయిందని తెలిపారు.
- పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ సైతం స్థల పరిశీలన చేసి శాశ్వత భవనాలు ఉన్నట్లు గుర్తించి, మార్కెట్ విలువను దాచిపెట్టి రిజిస్ట్రేషన్ జరిగినట్లు నివేదిక ఇచ్చారు.
- ఆర్‌సీసీ నిర్మాణం 2,591 చదరపు అడుగులు, ఏసీసీ నిర్మాణం 17,361 చదరపు అడుగులుగా నివేదికలో పొందుపరిచారు.
- రవీంద్రన్ తెలిపిన ఆస్తి విలువ రూ.1.8 కోట్లు కాగా విచారణలో మొత్తం ఆస్తి విలువ రూ.6.47 కోట్లుగా లెక్కగట్టారు.

ఫిర్యాదు మేరకే విచారణ చేపట్టాం

ఆర్కే గార్డెన్స్ క్రయ విక్రయాలపై వచ్చిన ఫిర్యాదు మేరకే విచారణ చేపట్టాం. విచారణలో పుత్తూరు ఎంపీడీఓ 2023 డిసెంబర్‌కు ముందే ఆ నిర్మాణాలపై నోటీసులు ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. 2023 డిసెంబర్‌లో జరిగిన ఈ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ చట్టం సెక్షన్ 27కి వ్యతిరేకంగా ఉన్నట్లు తేలింది. దీంతో పూర్తి స్థాయి స్టాంప్ డ్యూటీ చెల్లించాలని ఆదేశించాం.

– జి.శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, తిరుపతి

అప్పల బాధ తాళలేక..



మృతి చెందిన నాగేందర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: అప్పుల బాధ తాళలేక వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన దంపతులు తిరుపతిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా సిద్ధవటం మండలం దేగవాండ్లపల్లికి చెందిన నిమ్మకాయల నాగేందర్ రెడ్డి(35) భార్య పుష్పవేణితో కలిసి బుధవారం తిరుపతికి చేరుకున్నాడు. నగరంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో రూము తీసుకుని వేకువజామున భార్యాభర్తలు ఇద్దరూ విషం సేవించారు. అయితే ఈ విషయం వారి కుటుంబీకులకు తెలియడంతో స్థానికుల సహాయంతో నాగేందర్ రెడ్డి తండ్రి మునిరెడ్డి వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. అయితే హాస్పిటల్లో చికిత్స పొందుతూ నాగేందర్ రెడ్డి మృతి చెందగా.. ఆయన భార్య పుష్పవేణి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

యువకుడికి కత్తిపోట్లు

కోట: మండలంలోని కొత్తపాళెంలో బుధవారం ఇద్దరు యువకుల మధ్య చిన్నపాటి వివాదం చివరకు కత్తిపోట్ల వరకు దారితీసింది. దీంతో విచక్షణ కోల్పోయిన శంకం సూర్య అనే యువకుడు శ్రీహరి అనే యువకుడిపై కత్తితో దాడి చేశాడు. శ్రీహరికి రెండు చోట్ల తీవ్రగాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ పవన్‌కుమార్ విచారణ జరిపారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల భద్రతే ముఖ్యం

– జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్

తిరుపతి మంగళం : జిల్లా పరిధిలో స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఫిట్‌నెస్ లేకుండా, చేయించుకోకుండా స్కూళ్లు, కళాశాలల బస్సులు రోడ్లపై తిప్పితే ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి జిల్లా పరిధిలో స్కూళ్లు, కళాశాలలకు సంబంధించి సుమారు 1700 బస్సులు, వ్యాన్లు ఉన్నాయని తెలిపారు. అందులో ఇప్పటికే 1400 బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకున్నారని, మిగిలిన 300 బస్సుల్లో కొన్ని కాలం చెల్లినవి, మరికొన్ని ఫిట్‌నెస్ చేయించుకోవసినవి ఉన్నాయన్నారు. విద్యార్థుల భద్రతే తమకు ముఖ్యమన్నారు. వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రం లేకుండా విద్యార్థులను తరలించరాదని ఇప్పటికే ఆయా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే నిబంధనలు పాటించని 15 బస్సులపై ఎంవీఐ అధికారులు కేసులు నమోదు చేశారని, అలాగే జరిమానా రూపంలో రూ.2 లక్షలు వసూలు చేశారన్నారు. కరకంబాడి సర్కిల్, రామాంజపల్లి జంక్షన్, రేణిగుంట రోడ్డు, తిరుచానూరు రోడ్డు మార్గాల్లో మోటార్ వాహన తనిఖీ అధికారులు వనం వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీనివాస రావు, అతికా నాజ్, మోహన్ కుమార్, అంజనేయ ప్రసాద్, రమణ నాయక్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు.